నాదెండ్ల మనోహర్‌ని కలిసిన రహీముల్లా

విశాలాంధ్ర-కనిగిరి : జనసేన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ని శనివారం ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి వై. రహీముల్లా మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కనిగిరి నియోజక వర్గంలోని జరుగుతున్న రాజకీయ పరిణామాల గురించి వివరంగా చర్చించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీని అధికారంలోకి తీసుకొని రావడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండ కడుతున్నామని వివరించారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

శ్రీశైలం నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడిగా వక్కలగడ్డ నియామకం

విశాలాంధ్ర-మార్కాపురం : నంద్యాల జిల్లా ప్రముఖ శ్రీశైలం శాసనసభ నియోజక వర్గానికి తెలుగు దేశం పార్టీ పరిశీలకులుగా వక్కలగడ్డ మల్లికార్జున నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుండి ఆయనకు ఉత్తర్వులు అందాయి. గతంలో ఈయన సతీమణి రాధిక మల్లికార్జున మున్సిపల్ చైర్మన్‌గా పని చేయగా, ఈయన ప్రస్తుతం పార్టీలో వాణిజ్య విభాగం కమిటీకి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వక్కలగడ్డ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో శ్రీశైలం నియోజక వర్గ టిడిపి పరిశీలకుడిగా పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చం నాయుడు నియమించడం ఆనందంగా వుందని అన్నారు. పార్టీ అప్పజెప్పిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ టిడిపి పురోభివృద్ధికి అవిరళ కృషి చేస్తానని అన్నారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులను చేస్తామని వక్కలగడ్డ అన్నారు.

బల్లిపల్లిలో తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మండలం గురువాజీపేట సెక్టర్ లోని బల్లిపల్లి గ్రామంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు సూపర్వైజర్ ఎంవీఎస్ పార్వతి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సూపర్వైజర్ పార్వతి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగిస్తే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. తల్లికి రొమ్ము క్యాన్సర్, గర్భశయ్య క్యాన్సర్ వంటివి రాకుండా ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ప్రకాశం జిల్లా ఎస్‌బిసిసి కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ గర్భవతులు బాలింతలు తీసుకొనే పౌష్టికాహారం గురించి అవగాహన కలిగించారు. ముందు గా గ్రామంలోని అంగన్వాడి కేంద్రం నుంచి పురవీధుల్లో తల్లిపాల ప్రాధాన్యత, పౌష్టికాహారం గురించి అవగాహన కలిగిస్తూ ర్యాలీ చేశారు. గర్భవతుల బాలింతలకు వైయస్సార్ పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యంపీటిసి గురవయ్య, ఎమ్మెస్కె ఆదిలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు సరోజినీ, సుబ్బలక్ష్మి, భాగ్యలక్ష్మి సెక్టార్ లీడర్లు రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో దారపనేని, బైరెడ్డి

విశాలాంధ్ర-పామూరు : ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానములో శనివారము కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, దేవనబోయిన నాగార్జునలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారి ఆశీర్వచనాలు అందజేసి లక్ష్మీ నరసింహ స్వామి వారి పట్టు వస్త్రం బహుకరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : వివిధ స్థాయిలలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఏలేవి ప్రసాద్ మాట్లాడుతూ రీఅపోర్షన్ ద్వారా సర్దుబాటు జరిగిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలన్నారు. జూన్, జూలై నెలకు సంబంధించి రెండు నెలలు జీతాలు అందక ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారన్నారు. హెచ్‌ఎం పోస్టు మంజూరైన పాఠశాలలకు డిడిఓ కోడు కేటాయించాలన్నారు. డిడిఓలు లేని పాఠశాలలకు ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు సమస్యతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పోగుల శేషగిరి రావుకు అందజేశారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించన వలంటీర్

విశాలాంధ్ర-దర్శి : దర్శి మండలంలోని ఎర్ర ఓబన్నపల్లి గ్రామంలోని అగ్నిపురి కాలనికి చెందిన యువకుడు మైనర్ బాలిక పట్ల అసభ్య కరంగా ప్రవర్తించడంతో బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు ఈ నెల 3వతేదీన రాత్రి 9గంటల సమయంలో మైనర్ బాలిక ఇంట్లో ఉండగా గుంటూరు అశోక్ ఎవరు లేని సమయం చూసి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి కరెంటు స్విచ్ అఫ్ చేసి బాలిక చెయ్యి పట్టుకొని ఒక్కసారి నా దగ్గరకు రా అని అనటంతో బాలిక భయపడి అరవగా విషయం ఎవ్వరికి అయిన చెబితే చంపుతానని బెదిరించి పారిపోయాడు. జరిగిన విషయం వాళ్ళ అమ్మకు చెప్పగా ఆమె స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అదే రోజు ముద్దాయిని ఎస్ఐ అరెస్ట్ చేసి శనివారం కోర్టులో హాజరు పంపగా మేజిస్ట్రేట్ రిమాండు విధించింది.

రేపు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-పామూరు : మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరము నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మమ్మీ డాడీ సెంటర్ లోని పద్మావతి అతిధి గృహం నందు ఉదయం గం.9.00లకు మెడికవర్ హాస్పిటల్ నెల్లూరు వారిచే ఉచిత వైద్య శిబిరము ప్రారంభ మగును. ఇందులో భాగంగా బిపి, షుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేయబడును. మరియు 45 సం.లు నుండి 60 సం.లు మహిళలకు క్యాన్సర్‌కి సంబందించిన పాప్స్ మీయర్ (రు.1500/- విలువ గల) పరీక్షలు ఉచితంగా చేయబడునన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుపై వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

కందుల నారాయణరెడ్డి, గూడూరి ఏరిక్షన్ బాబు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో తలపెట్టిన వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ సందర్శన పాదయాత్రను పెద్దదోర్నాలలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని తెలియజేశారు. మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మరియు యర్రగొండ పాలెం టీడీపీ ఇంచార్జి గూడూరి ఏరిక్షన్ బాబు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, హమ్ ఆద్మీ సుదర్శన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మేమేమి ధర్నాలు రాస్తారోకోలు, రోడ్డు దిగ్బంధనలు చేయడానికి రాలేదని, ప్రజలకు ఉపయోగపడే వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ సందర్శనకు మాత్రమే వచ్చామని, దీనిని పోలీసులు అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. మార్కాపురం పట్టణంలో ఈరోజు ఒక షాపింగ్ మాల్ ఓపెన్‌కు ఒక హీరోయిన్ వస్తున్న నేపథ్యంలో 2000 మంది గుమిగుడారని వందలాది మంది పోలీసులు ట్రాఫిక్ మళ్లించి తమ విధులు నిర్వహిస్తున్నారని, ఇది ఎక్కడ చోద్యమని ప్రజా సమస్యలపై తాము పోరాడుతుంటే అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం అఖిలపక్ష నాయకులు రహస్యంగా ఫీడర్ కెనాల్‌కు చేరుకొని కటకానిపల్లి నుండి పాదయాత్ర చేసు కుంటూ కడప రాజు పల్లి వరకు ఐదు కిలోమీటర్ల మేర ఫీడర్ కెనాల్‌ను పరిశీలించారు. అనంతరం అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ ఇరిగేషన్ మంత్రి మరియు ఈ జిల్లా మంత్రి అక్టోబర్లో వెలుగొండ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేస్తామని చెబుతున్నారని, వెలుగొండ ప్రాజెక్టు పరిధిలో 11 ముంపు గ్రామాలు, ఉంటే రెండు గ్రామాలకు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని, మిగతా గ్రామాల పరిస్థితి ఏంటని, 2018 సంవత్సరం లోపు 18 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే ప్యాకేజీ ఇస్తామని చెబుతున్నారని, కానీ 2024 లోపు 18 సంవత్సరాల నుండి ప్రతి ఒక్కరికి ప్యాకేజీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెలుగొండ ప్రాజెక్ట్ 43 టీఎంసీల సామర్థ్యం కలదని, ఇప్పుడు ఐదు టీఎంసీలు, నీళ్లు విడుదల చేసి పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా మిగతా 38 టీఎంసీలను రాయలసీమకు తరలించాలని చూస్తున్నారని, ఈ ప్రాంత రైతులను అన్యాయం చేయవద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఇక పూర్తిస్థాయిలో కెనాల్‌కు నీళ్లు వదిలితే, కట్ట తెగితే నీరు కింది గ్రామాల ప్రజల ప్రాణాలు పోవడం ఖాయం అని, పంట పొలాలు పూర్తిగా నీటిలో మునగడం ఖాయం అని దయచేసి ప్రజల ప్రాణాలతో ఆటలు ఆడవద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎరువ మల్లారెడ్డి, పెద్దారవీడు మండల కన్వీనర్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, శనగల నారాయణరెడ్డి, వై.పాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు, మండల టీడీపీ కన్వీనర్లు, నాయకులు, షేక్ మాబు, దేసు నాగేంద్ర బాబు, దొడ్డ శేషాద్రి, ఈదర మల్లయ్య, షేక్. రఫీ, పఠాన్ ఖన్, వెంకటేశ్వర్లుచంటి, రావి క్రింది సుబ్బరత్నం, జెడ్డా రవి, జెడి లక్ష్మయ్య చెన్నారెడ్డి, బోలో బాలకృష్ణారెడ్డి, బొల్లా రమణారెడ్డి, వెంగల్ రెడ్డి, గొట్టం శ్రీనివాస్ రెడ్డి, షేక్ సమద్, సిపిఐ పార్టీ నాయకులు, కెవి కృష్ణ గౌడు, సీనియర్ నాయకుడు చెన్నయ్య, బాణాల రామయ్య, విశ్వరూప ఆచారి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

విశాలాంధ్ర-దర్శి : ప్రజా సమస్యలు పరిష్కారం కోసం జగనన్న గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను ఏర్పాటు చేయడం జరిగింది అని దర్శి ఎమెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. దర్శి పట్టణం లోని 18వ వార్డులో అద్దంకి రోడ్డులోని రామాలయం గుడి వద్ద నుండి శనివారం గడప గడప కార్యక్రమంను ఎమెల్యే నిర్వహించారు. ఎమెల్యే వేణు గోపాల్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రవేశ పెట్టి, అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు అందు తున్నాయా లేదా తెలుసుకునేందుకు, ఒక వేళ అందాకా పోతే దానికి గల కారణాలు తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తునట్లు ఎమెల్యే తెలిపారు. దేశంలోని అందరు ముఖ్య మంత్రులకు జగనన్న రోల్డ్ మోడల్‌గా నిలిచాడని అన్నారు. ఈ కార్యక్రమంనకు ముందుగా దర్శిలోని స్మశాన వాటికలని పరిశీలించారు. అనంతరం పల్లె వనం పార్క్‌ను సందర్శించారు. క్యాంపు ఆఫీస్‌లో ప్రజల సమస్యలు తెలుసుకొని అధికారులుతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు.

లంచం అడిగిన వీఆర్వోకు షాక్

మారు వేషంలో వచ్చి అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు

విశాలాంధ్ర-రాచర్ల : ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డుల్లో పేరు నమోదుకు లంచం ఇవ్వాలని తన చుట్టు తిప్పుకున్న ఓ వీఆర్వో చివరికి కటకటాలపాలయ్యాడు. ఏసీబీ అధికారులు మారు వేషంలో వచ్చి వీఆర్వోను పట్టుకున్న ఘటన రాచర్ల మండలంలో కలకలం రేపింది. మండలంలోని యడవల్లి గ్రామ వీఆర్వో పిక్కిలి వెంకటేశ్వర్లు రూ.5వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శనివారం మండల కేంద్రమైన రాచర్లలో వల పన్ని పట్టుకున్నారు. బాపట్ల జిల్లా నాదెండ్ల మండలానికి చెందిన గజ్జ శంకరయ్య అనే వ్యక్తికి తన పూర్వీకులకు రాచర్ల మండలంలో వ్యవసాయ భూములు ఉన్నాయి. సత్యవోలు రెవెన్యూ గ్రామంలో ఉన్న 0.68 సెంట్ల భూమిని ఆన్లైన్ రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడానికి వీఆర్వో వెంకటేశ్వర్లు పలు విడతలుగా శంకరయ్య నుంచి రూ. 10 వేలు లంచంగా తీసుకున్నాడు. నెలలు ఆయన చుట్టు ప్రదక్షిణలు చేసినా.. మనసు కరగలేదు. చివరికి ఇంకా రూ.5 వేలు తీసుకుని భూమి ఆన్‌లైన్ చేసేందుకు ఒప్పుకున్నాడు. ఇదే విషయాన్ని బాధితుడు శంకరయ్య ఏసీబీ అధికారులకు వివరించాడు. బాధితుడు శంకరయ్య ఒంగోలు ఏసీబీ కార్యాలయాన్ని ఈ నెల నాలుగో తేదీన ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్న ఒంగోలు జిల్లా ఏసీబీ అధికారుల బృందం ట్రాప్ వేసి వీఆర్వో వెంకటేశ్వర్లు ఆ మొత్తాన్ని తీసు కుంటుండగా పట్టుకున్నామని ఏసీబీ డీఎస్పీ పి.శ్రీనివాసులు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితుడు వెంకటేశ్వర్లును నెల్లూరు ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు.

తల్లిపాలు ముద్దు..డబ్బాపాలు వద్దు

ఐసీడీఎస్ సూపర్వైజర్ జరీనా

విశాలాంధ్ర-పీసీపల్లి : ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండలంలోని పెద అలవలపాడు అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ జరిగిన మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపు తల్లి ముర్రు పాలు బిడ్డకు పట్టించాలన్నారు. దేవుడు ఇచ్చిన అమృతం లాంటి తల్లిపాలను గంటలోపు శిశువుకు పట్టించడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా రక్తహీనత గర్భాశయ వ్యాధులు దరిచేరవని తల్లికి క్యాన్సర్ గుండెకు సంబంధించిన వ్యాధుల నుండి విముక్తి పొందవచ్చని తెలియజేశారు. అనంతరం బాలింతలు గర్భిణీ స్త్రీలకు డబ్బా పాలు వద్దు... తల్లిపాలే ముద్దు అనే నినాదం పై తల్లిపాల విశిష్టతను తెలియజేశారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలోనూ అవగాహన శిబిరాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరుస్తామని తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో 211 మంది 'శ్రీహర్షిణీ' విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక శ్రీ హర్షిణీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం డిగ్రీ ఫైనల్ ఇయర్ పూర్తి అయిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఏ ఎంపికలలో హైదరాబాదుకు చెందిన హెడిఎఫ్‌సి హోమ్ లోన్స్‌కు 53 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరి సంవత్సర వేతనం రూ.2.5 లక్షలు.టాటా క్యాపిటల్ హెూమ్ లోన్స్ కంపెనీకి 17 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరి సంవత్సర వేతనం రూ.3.0 లక్షలు. బిసిబి బ్యాంకుకు 13 నంది విద్యార్థులు ఎంపికయ్యారు వీధి సంవత్సర వేతనం 3.2 లక్షలు.ఓపెన్ మైండ్ కంపెనీకి 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరి సంవత్సర వేతనం రూ.2.2 లక్షలు. బెంగళూరుకు చెందిన అల్ట్రా టెక్నాలజీస్ కంపెనీకి 107 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరి సంవత్సర వేతనం రూ.2.1 లక్షలు. ఒంగోలు కు చెందిన సిరా టెక్నిక్స్ కంపెనీకి 3 విద్యార్థులు.ఓనియోకార్ట్ రిటైల్ సేల్స్ అండ్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరి సంవత్సర వేతనం 2.2 లక్షలగా ఉంటుంది. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఇప్పటివరకు ప్రాంగణ ఎంపికల ద్వారా 763 మంది విద్యార్థులకు ఉద్యోగాల అవకాశాలు కల్పించామని తెలియజేశారు ఇంకా రాబోయే రోజులలో ప్రాంగణ ఎంపికల ద్వారా మా కళాశాలలో డిగ్రీ చేరిన ప్రతి విద్యార్థికి ఉద్యోగం వచ్చే విధంగా కృషి చేస్తామని తెలియజేశారు దీనికి కారణం డిగ్రీ మొదటి సంవత్సరం నుండి మా కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థికి ప్రాంగణ ఎంపికలకు మరియు గవర్నమెంట్ ఉద్యోగాలకు కావలసిన అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లీష్ సబ్జెక్టులను డిగ్రీ మొదటి సంవత్సరము నుండి విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా బోధించడం జరుగుతుంది అని తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, కళాశాల ప్రిన్సిపల్ దాది ఆంజనేయులు, పీజీ కోఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి,ఎ.ఓ ర్యాంకర్స్ శ్రీనివాసరావు, ఇన్చార్జి గిరీష్, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

నాసరికమా..నిర్లక్ష్యమా.?

విశాలాంధ్ర-కంభం : కంభంలో అమరావతి టు అనంతపురం బైపాస్ రోడ్డు పక్కన కంభం బస్టాండ్‌కు వెళ్ళే దారిలో ఈ మధ్యకాలంలో నిర్మించిన సైడ్ కాలువకు పెద్ద గోతి ఏర్పడడం ప్రజలను అబ్బో అనిపిస్తుంది ఏ నాణ్యతతో సైడ్ కాలువ నిర్మించారు. ఆ దేవుడికే ఎరుక అని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు, బైపాస్ నుండి బస్టాండుకు అటు ఇటు వందలాది వాహనాలు తిరిగే రోడ్డుని మార్కాపురానికి వెళ్లే ప్రధాన రహదారి అని తెలిసి కూడా బైపాస్ రోడ్డు సిబ్బంది ఆ కాల్వను నాసిరకంగా ఏర్పాటు చేయడం రోడ్డు అధికారులకే చెల్లిందని ప్రజలు అను కుంటున్నారు. ఎంతోమంది అధికారులు కూడా అటు ఇటు తిరుగుతూ గుంతపడిన కాల్వను చూసుకుంటూ పోవడం తప్ప రోడ్డు అధికారులను ప్రశ్నించే బాధ్యత వారికి లేదా అని ప్రజలు అనుకుంటున్నారు. ఇదే బైపాస్ రోడ్డులో సూచిక బోర్డు లేకున్నా రాత్రి అయితే లైట్లు ఉన్నా వెలుతురు లేకున్న ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్న మాకెందుకు అనట్టు బైపాస్ రోడ్డు సిబ్బంది. వ్యవహరిస్తున్నారని ప్రజలు అను కుంటున్నారు. ఈ మధ్య కాలంలో కుక్కలు బర్రెలు ప్రతి జంతువులు రోడ్డుపైనే జీవిస్తున్న ఆ జంతువులని కొన్ని వాహనాలు ఢీ కొని మనషుల ప్రాణాలు గాల్లో కలుస్తున్న రోడ్డు సిబ్బందికి, చిమకుట్టినట్టు లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బైపాస్ రోడ్డు సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకొని రోడ్డుపై ఉన్న సమస్యలను త్వరిగతిన పరిష్కరించాలని, స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

కచ్చితమైన సమాచారంతో ఓటరు జాబితా ఉండాలి

విశాలాంధ్ర-టంగుటూరు : కచ్చితమైన సమాచారంతో ఓటరు జాబితా ఉండాలని తహశీల్దారు సంజీవరావు అన్నారు. శనివారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. తహశీల్దారు మాట్లాడుతూ కచ్చితమైన సమాచారంతో ఓటరు జాబితా ఉండాలని, డబుల్ ఎంట్రీలు డెత్‌లు డోర్ టు డోర్ పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ శ్రీనాథ్, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

'శ్రామిక గర్జన' జయప్రదం చేయాలి

ఏటీయూసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్

విశాలాంధ్ర-కనిగిరి : కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నలిగిపోతున్న కార్మిక వర్గం నరేంద్ర మోడీని గద్దె దించాలి దేశాన్ని రక్షించాలని నినాదంతో ఆగస్టు 9వ తేదీన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో విజయవాడలో జరుగు శ్రామిక గర్జనను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఆసిన్ శనివారం పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ శ్రామిక గర్జన ఆందోళనలో భాగంగా జిల్లాలో ఆగస్టు 6 7 తేదీల్లో పారిశ్రామిక కార్మిక వర్గ ప్రాంతాల్లో దేశాన్ని రక్షించాలి మోడీని గద్దెదించాలని నినాదంతో ప్లే కార్డులతో మోటర్ ర్యాలీలు ద్వారా ప్రచార కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆగస్టు 8న మనోహరాలు అన్ని ప్రాంతాల్లో జరపాలని కోరారు. కార్మికులకు రక్షణగా ఉండే 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోర్సుగా తీసుకుని రావడం వల్ల కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. కావున కార్మిక సోదరులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు.

'కిమ్స్' ఉచిత వైద్య శిబిరానికి 200 మంది హాజరు

విశాలాంధ్ర-ఒంగోలు : జే.పంగులూరు మండలం లోని కోటపాడు గ్రామ రైతుభరోసా కార్యాలయం వద్ద కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు వారి ఆధ్వర్యములో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి మంచి స్పందన లభించినట్లు ఉచిత వైద్య శిబిర సమన్వయకర్త తాళ్ళూరి రామాంజనేయులు మరియు కిమ్స్ అద్దంకి ఏరియా పి.ఆర్.ఓ పి.కాలేషావలి తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో కిమ్స్ వైద్యులు దా. బైపనేని రామాంజ నేయులు'ుమారు 200 మంది రోగులకు బిపి, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి వారికి ఒక వారం రోజులకు సరిపడా మందులను కుడా ఉచితంగా అందజేసినారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 35 మందికి కంటి లోపల శు క్లములు మరియు పొరలు ఉన్నవారికి ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్స్ నందు ఉచితంగా ఆపరేషన్స్ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కోటపాడు ఏఎన్ఎం మంగమ్మ, ఆశ వర్కర్లు సుజాత,శీత మరియు కిమ్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామాలలో క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ బి మాధవి లత అన్నారు. మండలంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పూరిమెట్ల, భీమవరం, నూజిలపల్లి, గ్రామాలలో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ అనుమానితులను గుర్తించి సకాలంలో వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలన్నారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి మందులు వాడినట్లయితే క్యాన్సర్ నీ దూరం చేయవచ్చు అన్నారు. పూరి మెట్ల గ్రామంలో వైద్యాధికారి సిహెచ్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషన్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 69 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బి.మధు శంకర్, డిఈఎంఓ సుబ్బారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ కే ఏ రాజు, సూపర్వైజర్ నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ ఎస్ కే యం యం సుభాని, ఏఎన్ఎం, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనులు పూర్తిచేయాలి

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి.శ్రీనివాస్

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ కాలువ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి, తద్వారా ఈ ప్రాజెక్టు ద్వారా నీళ్లు రైతులకు అందజేయాలని ఎర్రగొండ పాలెం నియోజకవర్గ సిపిఐ పార్టీ దేవెండ్ల శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలోని ప్రాజెక్ట్ కాలువ సందర్శనలో భాగంగా కాల్వ నిర్మాణాన్ని పరిశీలించారు. మండలంలోని కటకాని పల్లె గ్రామం నుండి, కడప రాజు పల్లి గ్రామ గ్రామం వరకు సుమారు 8 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ కాలు వలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి, డి శ్రీనివాస్ మరియు, సిపిఐ కార్యవర్గ సభ్యుడు కెవి కృష్ణ గౌడ్, విలేకరులతో మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ఆశాజ్యోతి అయిన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి 20 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ, ఇప్పటికి ప్రాజెక్టు నుండి రైతులకు నీరు ఇవ్వకపోవడం, ఈ ప్రాంత, రైతులకు బాధాకరం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, బడ్జెట్లో 100 కోట్లు కేటాయించి, ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని, ప్రజలు నమ్మించి మోసం చేయడం తప్ప ఏమి చేసేది లేదని తెలియచేశారు. కార్య క్రమంలో రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి, బాణాల రామయ్య, సిపిఐ పార్టీ సీనియర్ నాయకుడు చెన్నయ్య, మండల కార్యదర్శి విశ్వరూప చారి, చీప్ ఏ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

చంద్రబాబు సభను జయప్రదం చేయండి

– మాజీ ఎమెల్యే నారపుశెట్టి పాపారావు

విశాలాంధ్ర-దర్శి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం సంత నూతల పాడు నియోజకవర్గం పరిధిలో పర్యటించానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సాగు నీటి ప్రాజెక్టుల విధ్వంసం యుద్ధ బేరి కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా గుండ్లకమ్మ ప్రాజెక్ట్ ను పరిశీలించనున్నారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు బహిరంగ సభ జరుగుతుంది అని మాజీ ఎమెల్యే నారపుశెట్టి పాపారావు తెలిపారు. ఆ సభను టిడిపి నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని మాజీ ఎమెల్యే కోరారు. దీనిపై నియోజకవర్గం సమన్వయ కమిటీ శనివారం సమావేశామయ్యారు. ఆ సభ విజయవంతం అయ్యేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మం, సమన్వయ కమిటీ సభ్యులు చిట్టెం వెంకటేశ్వర్లు, నాగుల పాటి శివ కోటేశ్వరరావు, యాదగిరి వాసు, పిడతల నెమలయ్య, కూరపాటి శ్రీను, బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : అమృతంతో సమానమైన తల్లిపాలు తాగే బిడ్డకు, పాలిచ్చే తల్లికి శ్రేయస్కరమని, ఈ విషయం పట్ల వైద్యరంగం పని చేస్తున్న వారితో పాటు ప్రజలకు అవగాహన కలిగిస్తే మంచి ప్రయోజనాలు కలుగుతాయి అని జీజీహెచ్ సూపరందేంట్ డాక్టర్ భగవాన్ నాయక్ అన్నారు. జీజీహెచ్‌లో పెడియాట్రిక్స్ విభాగం ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా అవగాహన సమావేశం నిర్వహించారు. పాల్గొన్న డాక్టర్ భగవాన్ నాయక్ పలు విలువైన సూచనలు చేశారు. తల్లిపాల ప్రాముఖ్యాన్ని గుర్తించి ఆసుపత్రిలో బేబీ శాలి ఫీడ్ రూమ్స్ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హెచ్ఓడి డాక్టర్ ఎలిజీ బెత్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డా క్టర్ శివరామ కృష్ణ మాట్లాడుతూ ఇప్పటికీ దేశంలో 24 శాతం మంది తల్లులు మాత్రమే తల్లిపాలు ఇస్తున్నారని, ఈ గణాంకాలు ఆందోళన కరమన్నారు. సంవత్సరం పొడుగునా అవగాహన ఒకలిగిస్తే మంచి ప్రయోజనాలు కలుగుతాయి అని అన్నారు. తల్లిపాలు మంచి తెలివతేటలు కలిగిన పిల్లలని తయారుచేస్తుంది అని ఈ విజయాన్ని ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలి గైనకాలజీ డాక్టర్ శ్రీదేవి అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ , వైద్య విద్యార్థులు, పెడియాట్రిక్స్, విభాగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. పోస్టర్స్ తయారు చేసిన విద్యార్థులకి బహుమతుల ప్రకటించారు.

అన్నార్తులకు అండగా శివం ఫౌండేషన్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి మానవత్వానికి చిరునామాగా నిలిచారు. నిత్య అన్నదాన సంచార వాహనం ద్వారా నగరంలోని పలు ప్రాంతాల్లో సుమారు 300 మందికి పైగా అనాథలకు ఆకలి తీరుస్తున్నారు. శనివారం న్యాయవాది వైజాగ్‌కి చెందిన పోకల వెంకట రామారావు కోడలు సుప్రియ జన్మదినం సందర్భంగా ప్రజా రచయిత డాక్టర్ మొగిలి దేవ చేతుల మీదుగా స్థానిక రిమ్స్ ప్రభుత్వ వైద్యశాల వద్ద కేకు కట్ చేసారు. అనంతరం ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి మాట్లాడారు.

అట్టహాసంగా లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం

- ప్రత్యేక ఆకర్షణగా సినీనటి హనీ రోజ్
- విచ్చేసిన మంత్రి సురేష్, ఎమ్మెల్యేలు కేపీ, అన్నా

విశాలాంధ్ర-మార్కాపురం : పశ్చిమ ప్రకాశం కేంద్రమైన మార్కాపురం పట్టణములో అధునాతన పద్దతుల్లో ఏర్పాటు చేసిన లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం అట్టహాసంగా జరిగింది. ప్రముఖ సినీ నటి హని రోజ్ హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. షాపింగ్ మాల్‌లో ఫస్ట్ ఫ్లోర్‌ను ప్రారంభించిన అనంతరం రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ సురేష్, ఎమ్మెల్యేలు కెపి నాగార్జున రెడ్డి, అన్నా రాంబాబులు మాట్లాడుతూ వెనకబడిన పశ్చిమ ప్రాంత కేంద్రమైన మార్కాపురం పట్టణంలో పెద్ద ఎత్తున లక్కీ షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేయడం హర్షణీమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస రెడ్డి, వైసిపి రాష్ట్ర సెక్రటరిలు డాక్టర్ యం షంషీర్ అలిభేగ్, వెన్నా ఇందిరా హనుమారెడ్డి. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళి కృష్ణ, వైస్ చైర్మన్ ఎస్‌కె ఇస్మాయిల్, యంపిపిలు పోరెడ్డి అరుణ, ఎస్ భూ లక్ష్మీ, సిపిఐ కార్యదర్శి అందె నాసరయ్య, సీపీఐ సీనియర్ నాయకులు మోహన్, లక్కీ షాపింగ్ మాల్ అధినేత, మార్కెట్ కమిటీ చైర్మన్ గోల మారు శ్రీనివాసరెడ్డి, బిసి బ్రిలియంట్ కమ్యూనిటీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పిఎల్‌పి యాదవ, నియోజక వర్గ బిజేపి ఇంచార్జీ పీవీ కృష్ణా రావు, శ్రీశైలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కనక దుర్గ,వైసిపి నాయకులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, బొగ్గరపు శేషయ్య, జవ్వాజి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్కీ షాపింగ్ మాల్ అధినేతలు జి.రత్తయ్య, స్వాములు, శ్రీనివాసులు ఆహూతులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం సందర్భంగ సినీ నటి హాని రోజ్‌ను చూసేందుకు యువకులు పెద్ద ఎత్తున పోటీ పడ్డారు.

పౌష్టికాహారంతో తల్లి బిడ్డ క్షేమం

విశాలాంధ్ర-పీసీపల్లి : వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణీలకు బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారంతో తల్లి బిడ్డ సురక్షితంగా ఆరోగ్యంగా ఉంటారని వైస్ ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్ అన్నారు. మండలంలోని పెద అలవలపాడు అంగన్వాడి కేంద్రంలో శనివారం సూపర్వైజర్ జరీనా ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ ఇంటింటికి సంపూర్ణ పోషణ పథకం కిట్లను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మాత్రమే అందించటం జరుగుతుందని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందిస్తున్న పోషకాలను వారి ఇంటి వద్దకు అందించేందుకు ప్రభుత్వం నూతనంగా టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం గర్భిణీలు బాలింతలు శిశువుల సంపూర్ణ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఈ కిట్ల ద్వారా మెరుగైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. సూపర్వైజర్ జరీనా మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలకు బియ్యం కందిపప్పు వంటనూనె పాలు గుడ్లు వంటి పోషక పదార్థాలను ప్రభుత్వం అందజేస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ శైలజ చెన్నుపాటి వెంకటేశ్వర్లు అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి

– ఎస్ఐ నాగ మల్లేశ్వరరావు

విశాలాంధ్ర-కంభం : కంభంలో బైపాస్ రోడ్డులో హెచ్‌పి పెట్రోల్ బంక్ పక్కన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన, కాటమాల అల్లూరయ్య, అధ్యక్షతన కంభం ఎస్సై వి. నాగమల్లేశ్వరరావు చేతులు మీదుగా హెల్మెట్ల పంపిణీ చేయడం జరిగింది. అలాగే హెల్మెట్లు లేని వారికి ద్విచక్ర వాహనదారులకు ఎస్సై పలు సూచనలు ఇచ్చారు. ఎస్సై మాట్లాడుతూ మీకోసం నమ్ముకొని ఇంట్లో వారు ఎంతోమంది మీ కుటుంబం ఇంటికి చేరేవరకు ఎదురుచూస్తుంటారు, వారి నమ్మకాన్ని నిలబెట్టాలంటే హెల్మెట్ ధరించడం ప్రభుత్వం ఇచ్చే సూచనలు పాటించడం, ఇలాంటివి చేసుకుంటూ పోతే మా ప్రాణాలను మేమే కాపాడుకోవచ్చని ఎస్ఐ, వి. నాగమల్లేశ్వరరావు తెలిపారు. అలాగే ఎంపీటీసీ 1 ఆనంద్ ప్రదీప్ మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్న కంభం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ అధ్యక్షులు కాటమాల. అల్లూరయ్యను అభినందించారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్న కమిటీకి వారికి కమిటీలో ఉన్న సభ్యులనందరికి పేరుపేరునా అభినందించారు. అలాగే రాజకీయంగా స్నేహ పరంగా నా వంతు సహాయం చేయడానికి ఎల్లవేళలా ముందుంటానని చెప్పడం జరిగింది. అలాగే బైపాస్ రోడ్డులో ద్విచక్ర వాహనదారులు మరియు అక్కడి ప్రజలు ఇలాంటి సహాయ కార్యక్రమాలు చేస్తున్న కమిటీ పేరుపేరునా వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కంభంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు ఇంకా చేయాలని అల్లూరయ్యను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్. హుస్సేన్ భాష, ఎంపిటిసి ఆనంద్ ప్రదీప్, సచివాలయ కన్వీనర్ మధు మరియు పాల్గొన్నారు.

29న విజయవాడలో 'శ్రామిక గర్జన'కు తరలిరండి

ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.హనుమంతరావు

విశాలాంధ్ర-దర్శి : కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నలిగిపోతున్న కార్మిక వర్గం మోదీని గద్దె దించాలి-దేశాన్ని రక్షించాలి అనే నినాదంతో విజయవాడ నగరంలో ఆగస్టు 9న శ్రామిక జన గర్జన నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ ప్రకాశం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోటంశెట్టి హనుమంతరావు తెలిపారు. స్థానిక గుజ్జుల సరళదేవి భవన్ సిపిఐ కార్యాలయంలో శనివారం ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాలతో ఏఐటీయూసీ దర్శి నియోజకవర్గ ఉపాధ్యక్షులు జూపల్లి కోటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన హనుమంతరావు మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా ఆగస్టు 9న విజయవాడ మహానగరంలో కార్మికులతో శ్రామిక జన గర్జన (మహాపడావ్) కు పిలుపునిచ్చాయని తెలిపారు. అదేవిధంగా ఆగస్టు 6 7 తేదీలలో అన్ని పారిశ్రామిక కార్మిక ప్రాంతాలలో మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను వివరిస్తూ క్విట్ మోడీ సేవ్ ఇండియా నినాదాలతో సైకిల్ మోటార్ బైక్ ర్యాలీల ద్వారా ప్రచార కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని హనుమంతరావు వివరించారు. కార్మికులకు రక్షణగా ఉన్న 42 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోర్సులు ప్రవేశపెట్టడం దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని ప్రైవేటు కార్పోరేట్ వ్యక్తులకు దారా దత్తం చేయడం విశాఖ స్టీలు గంగవరం పోర్టు లాంటి వాటిని ప్రైవేటీకరించదానికి కార్మికులు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు దేశాన్ని ఇటువంటి దేశద్రోహుల నుండి కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జూపల్లి కోటేశ్వరరావు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరు చిన్న ఆంజనేయులు, జి కాశిరెడ్డి, జక్కా బుచ్చయ్య, మెట్నాల శ్రీను, వెంకటరావు, గుర్రపు సాల బాలరాజు, శ్రీను వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టిప్పర్ – స్కూటీ ఢీ

ఒకరికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర - పొదిలి : ఒంగోలు కర్నూలు రహదారిపై టిప్పర్ స్కూటీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళ్తే ఒంగోలు వైపు నుండి కర్నూలు రహదారిపై పొదిలి పాత బస్టాండు మీదుగా టిప్పర్ వెళ్తుండగా మండలంలోని మంగాపురం గ్రామానికి చెందిన కల్లూరి రాంబాబు తన మిత్రునితో కలిసి పొదిలి పాత బస్టాండ్ సమీపంలో నున్న మాహలక్ష్మమ్మ దేవస్థానం ఎదురుగా లారీని క్రాస్ చేస్తుండగా టిప్పర్ స్కూటీ ఢీ కొని రాంబాబుకు తీవ్ర గాయాలు పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యాధికారులు ప్రథమ చికిత్స నిర్వహించి అనంతరం మెరుగైన చికిత్స కొరకు108 వాహణం ద్వారా ఒంగోలు తరలించడం జరిగింది.

జాహ్నవి విద్యార్థుల ల్యాబ్ సందర్శన

విశాలాంధ్ర -ఒంగోలు : స్థానిక వీఐపీ రోడ్డులోని జాహ్నవి నీటి అకాడమీ విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు ల్యాబ్ అనుభవం కోసం స్థానిక సిఎస్ఆర్ శర్మ కాలేజీలోని ల్యాబ్‌ను పరిశీలించారు బాటిల్, బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లకు సంబంధించిన ల్యాబ్‌లను ఈ సందర్భంగా విద్యార్థులు సందర్శించారు. ల్యాబ్లో ప్రపంచంలోని అతిపెద్ద జంతువైన తిమింగలం అస్తి పంజరాన్ని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసరావు, జాహ్నవి నీట్ అకాడమీ డైరెక్టర్ పి జనార్దన్ విద్యార్థులకు ల్యాబ్ యొక్క ఆవశ్యకతను వివరించారు.

అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించిన పెద్దిశెట్టి వరలక్ష్మీ

విశాలాంధ్ర - ఒంగోలు : పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు తెలుగునాడు అంగన్వాడి, డ్వాక్రా సాధికార సంస్థ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దిశెట్టి వరలక్ష్మి విస్తృతంగా అంగన్వాడీ సెంటర్లను సందర్శిస్తున్నారు. శనివారం నగరంలోని ఆర్పి రోడ్డులోని 10 లైన్ ఉన్న 8, 107 అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి, అక్కడ పరిస్థితులపై ఆరా తీశారు. పిల్లలకు, బాలింతలకు, గర్భిణీలకు, పౌష్టికాహారం అందుతుందా...? లేదా...? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టీచర్లు, సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. పార్టీ పెద్దల దృష్టికి అంగన్వాడీ సమస్యలను తీసుకెళతామని తెలిపారు. అనంతరం చిన్న పిల్లలకు బిస్కెట్లను పంపిణీ చేశారు.

తాగునీటి డీప్ బోరు,వాటర్ ట్యాంక్ ప్రారంభం

విశాలాంధ్ర-పెద్దారవీడు : పేద బడుగు బలహీన అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తుందని అందులో భాగంగా మార్కాపురం డివిజన్ ప్రాంతంలో పలు సేవా కార్యక్రమాలతో పాటు ప్రత్యేకంగా చెంచు గిరిజనుల సమస్యలపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ సొసైటీ మార్కాపురం ఫౌండర్ అండ్ డైరెక్టర్ బిషప్ రెవరెండ్ డాక్టర్ గుర్రం శేఖర్ అన్నారు. శనివారం మండలంలోని సుంకేసుల గ్రామంలో క్రిస్టియన్ పాలెంలో నూతన డీప్ బోరును వేసి, వాటర్ ట్యాంకును నిర్మించిన బిషప్ రెవ.డాక్టర్ గుర్రం శేఖర్ ప్రారంభించారు. తమ గ్రామంలో నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడి నివారణకు బోరు ఏర్పాటు చేయవలసిందిగా జీసస్ లవ్ మినిస్ట్రీస్ సొసైటీ వారిని గ్రామ సర్పంచ్ గుద్దెపోగు రమేష్, గ్రామస్తుల అభ్యర్థన మేరకు డీప్ బోర్ ఏర్పాటు చేసి, వాటర్ ట్యాంక్ నిర్మించడం జరిగిందని తెలియజేశారు. 2 లక్షల 90 వేలు రూపాయలతో డీప్ బోర్ ఏర్పాటు చేసి, వాటర్ ట్యాంక్ నిర్మించినందుకు గ్రామ సర్పంచ్ రమేష్, గ్రామస్తులు జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ సొసైటీ ఫౌండర్ అండ్ డైరెక్టర్ బిషప్ రెవరెండ్ డాక్టర్ గుర్రం శేఖర్, ట్రెజరర్ సునీతా రూత్ బెన్ని లను దుశ్శాలువలు, పూల దండలతో సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ కాపరి పొట్టపాటి సలోమన్ రాజు,"ఎద్దారవీడు గ్రామ సర్పంచి దుగ్గెం చెన్నమ్మ, స్థానిక పంచాయతీ కార్యదర్శి ఆర్ పెద్దిరాజు, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీను నాయక్, జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ కో-ఆర్డినేటర్ విజయ్ కుమార్, సొసైటీ కంప్యూటరిస్ట్ థిర్సా, సూపర్వైజర్స్ సింగా ఏసన్న, బి.దిలీప్ కుమార్, ఫీల్డ్ వర్కర్స్ బి.మత్తయ్య, జేమ్స్, డేవిడ్ రాజ్, సురేష్, యేసుదానం, నాసరయ్య, జడ్డా నాగయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఈయూ రాష్ట్ర నాయకులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య

విశాలాంధ్ర-ఒంగోలు : ఏపిపిటిడి(ఆర్టీసి) ఎంప్లాయిస్ యూనియన్ ప్రకాశం(ఒంగోలు) జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం ఒంగోలు సిపిఐ ఆఫీసులో జిల్లా యూనియన్ అధ్యక్షులు యస్.పోలయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశములో ముఖ్య అతిధులుగా ఆర్టీసి ఇ.యు రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్రప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి. సుబ్రహ్మణ్యం రాజు, రాష్ట్ర ఛీఫ్ వైస్ ప్రెసిడెంటు కె.నాగేశ్వరరావు, డిప్యూటీ జెనరల్ సెక్రటరీ జి.నారాయణ రావు పాల్గొన్నారు. ఈసమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇ.యు రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఏపియస్ ఆర్టీసి కార్మికులు విలీనం అనంతరం ఏపిపిటిడి(ఆర్టీసీ) ఉద్యోగులుగా మారిన తదుపరి గతంలో సేలరీ బ్యాసిడ్ గా చెల్లించే ఓవర్ టైమ్ డ్యూటీ(ఓటి)నైట్ హాల్టు అలవెన్సులు, మహిళలకు ప్రతినెలా చెల్లించే హెల్తు అలవెన్సు, మెంటినెన్సు సిబ్బందికి ఇచ్చే టెక్నికల్ అలవెన్సులు, క్లరికల్ సిబ్బందినుండి ఆఫీసర్లు చెల్లించే గ్రేడ్ పే అలవెన్సులు అన్ని జీతంతో పాటే చెల్లించేలా చూడాలని,అలాగే ఇన్సెంటివ్ స్కీమ్లులను పాతపద్ద పద్దతులలోనే కండక్టర్సు, డ్రైవర్సుకు, మెంటినెన్సు సిబ్బందికి ప్రతినెలా చెల్లించేలా చూడాలని, వైద్య సౌకర్యాలు కూడా గతంలో మాదిరిగానే ఇ.హెచ్.యస్ నుండి ఆర్టీసి ఉద్యోగులకు మినహాయింపునిచ్చి మెరుగైన ట్రీట్మెంట్ కొరకు రెఫరల్ హాస్పిటల్స్ ద్వారా కార్పొరేట్ వైద్యము చేయించేలా చర్యలు తీసుకోవాలని,అంతే కాకుండా రిటైర్ అయిన ఆర్టీసి ఉద్యోగి,బార్య,బర్త లకు కూడా గతంలో ఉన్న రిటైర్డుఎంప్లాయిస్ మెడికిల్ స్కీమ్ (ఆర్.ఇ.యం.యస్) ద్వారా వైద్యసౌకర్యాలు అందించాలన్న పలుడిమాండ్లును ఇప్పటికే ప్రభుత్వ ఉన్నతాధికార్లు దృష్టికి,ఆర్టీసి యం.డి శ్రీ.ద్వారకా తిరుమలరావుతో జరిగిన చర్చలలో వారిదృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందని వారు కూడా సానుకులంగా స్పందించారని వీటిని సాదించుకొనేందుకు ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రకమిటిగా నిరంతరం కృషిచేస్తున్నామని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. మరో ముఖ్యఅతిథి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య మాట్లాడుతూ 11 వ పిఆర్సీ అమలు జరిగిన అనంతరం కేడర్ స్ట్రెంగ్తు పిక్షేషన్లో జరిగిన ఇబ్బందులపై ఏపిపిటీడి ఎంప్లాయిస్ యూనియన్ కృషిమేరకు ఆర్టీసి మేనేజింగు డైరెక్టర్ ద్వారకా తిరుమలరావుతో గత నెల 24న అన్ని ఉద్యోగు సంఘాలతో జరిపిన చర్చలు సందర్భంగా కేడర్ స్ట్రెంక్తు వలన ఉద్యోగులకు ఉత్పన్నమౌతున్న సమస్యలపై తనపరిధిలో ఉన్నవన్ని తొలగిస్తామని ఉద్యోగులు ఎవరు ఆందోళన చెందనవసరం లేదని హామిఇచ్చారని ఆయన తెలిపారు. ఇ.యు రాష్ట్ర సహాయకార్యదర్శి యస్.యస్. నారాయణ, జోనల్ అధ్యక్షులు వాకా రమేష్ మాట్లాడుతూ విలీనంకు ముందు వున్నటువంటి ఆర్టీసి రిక్రూట్ మెంట్ రెగ్యులేషన్స్ ప్రకారమే పిటిడి ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని ఎంప్లాయిస్ యూనియన్/ఏపిజేఏసి అమరావతి నాయకత్వం కలసి కృషి చేస్తున్నామని ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొనిపోయి పరిష్కరానికి కృషి చేస్తున్నామని,పిటిడి ఉద్యోగులకు పెండింగు లో వున్న లీవ్ ఎన్ క్యాష్ మెంట్ ను సెప్టెంబర్ నెలాఖరులోగా ప్రభుత్వం చెల్లించేందుకు అంగీకరించిందని ఆయన తెలియజేసినారు. మరోక ముఖ్యఅతిధి ఇ.యు రాష్ట్ర డిప్యూటీ జెనరల్ సెక్రటరీ జి.నారాయణరావు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జివోఃనెంః 70,71 ద్వారా కాండక్ట్ మరియు సిసిఏ నిబంధనలలో ఉన్న విషయాలను ఉద్యోగులకు అర్ధమయ్యేలా తెలియజేస్తూ ఇవన్ని పాతవేనని కొన్ని సంఘాలనాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలని నమ్మవద్దని ఈ జివో లపై మరలకేసులపరిష్కారానికీ సంబందించి ఆర్టీసి యం.డి గారు కూడా సర్క్యులర్ విడుదల చేస్తారని ఇందులో ఏమైనా సర్క్యులర్ నెంః 01/2019 ని రద్దుచేసినట్లు ఏమైనా ఆదేశాలు వస్తే మాత్రం దానిపై మాత్రం తప్పకుండా ఇ.యు రాష్ట్ర కమిటీగా స్పందించి యం.డితో మాట్లాడుతామని తెలిపారు. ఇ.యు రాష్ట్రఛీఫ్ వైస్ ప్రెసిడెంటు కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ పెన్షన్ స్కీమ్లులలో ఉన్న గందరగోళ పరిస్థితులపైన, హయ్యర్ పెన్షన్ గూర్చి వివరించారు. ఈ సమావేశంలో జోన్ నాయకులు చక్రపాణి,బెజవాడ రవి, కొండలరావు, వెంకటేశ్వర్లు మరియు జిల్లా వర్కింగు ప్రెసిడెంటు ఓబులయ్య మరియు అన్ని డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజ్ నాయకులు మాట్లాడారు, అధికసంఖ్యలో ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో శనివారం ఇన్చార్జి ఎంపీడీవో ఎన్‌విఎల్ హనుమంతరావు అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు త్రాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం లో భాగంగా నా భూమి నాదేశం కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటాలన్నారు.50 శాతం పండ్ల మొక్కలు నాటాలన్నారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాలను సందర్శించి ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కండ్ల కలక విజృంభిస్తున్నందున ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. అందులో ప్రధానంగా సింగనపాలెంలో అంగనవాడి కేంద్రానికి సాగర్ నీరు అందడం లేదని అంగన్వాడి సూపర్వైజర్ తెలిపారు. మక్కినేని వారి పాలెం లో పాఠశాల నిర్మాణానికి పనులు వేగవంతం చేయాలని, త్రాగునీటి పైపుల నిర్మాణ కొరకు పనులు చేపట్టాలని కోరారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతూ నేనే స్వయంగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి తాతపూడి మోజేష్ రత్నం రాజు, పంచాయతీరాజ్ డిఇ విటల్ రాథోడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

రాళ్ల దాడులకు టీడీపీ భయపడదు

విశాలాంధ్ర-గిద్దలూరు : రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పై వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని, ప్రభుత్వ తీరును ప్రజల్లో ఎండగడుతున్న టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులైన వైసీపీ గూండాలు రాళ్ల దాడికి దిగటం రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని చెప్పటానికి, ఆటవిక రాజ్యం నడుస్తుందనడానికి నిదర్శనం అని గిద్దలూరు టీడీపీ నాయకులు అన్నారు. పుంగనూరులో చంద్రబాబు, టీడీపీ కార్యకర్తల పై వైసీపీ రౌడీ మూకలు చేసిన దాడిని గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆయన ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు, వైసీపీ దాడికి నిరసనగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలియచేశారు. చంద్రబాబు, టిడిపి కార్యకర్తల పై రాళ్ల దాడి చేసిన వైసిపి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని చెప్పటానికి ఇదొక నిదర్శనం అన్నారు.చంద్రబాబు,టిడిపి కార్యకర్తల పై వైసీపీ గూండాలు రాళ్ల దాడి చేస్తుంటే పోలీసులు చేష్టలుడిగి చూస్తున్నారని మండిపడ్డారు. ఓటమి భయంతోనే వైసిపి ఇలాంటి దాడులకు తెగబడుతుందని, టిడిపి చూస్తూ ఊరుకోదని, దాడికి ప్రతి దాడి తమకు కూడా తెలుసునని, చంద్రబాబు ఒక్క సైగా చేస్తే వైసిపి గూండాలను రాష్ట్రం నుంచి తరిమి తరిమి కొడతామని హెచ్చరించారు. ఇప్పటివరకు ఎంతో సహనంతో ఉన్నామని,మరోసారి ఇలాగే దాడులకు తెగబడితే,టిడిపి ప్రతిఘటన ఎలా ఉంటుందో చూస్తారన్నారు. పోలీసులు సమక్షంలోనే చంద్రబాబు పై రాళ్ల దాడి జరుగుతుంటే చూస్తూ ఊరుకున్నారని,పోలీసులకు జీతాలు ఇచ్చేది ప్రజల డబ్బుతో కానీ,వైసీపీ నేతల జేబులో నుంచి ఇవ్వడం లేదననే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పులు చేసిన పోలీసులు కూడా తగిన శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని దాడి చేసిన వైసీపీ గూండాల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేశా వలి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ పెద్ద మస్తాన్,పార్లమెంట్ నాయకులు గోపారపు గోపాల్ రెడ్డి,షేక్ మహబూబ్ బాషా, ఎస్సి నాయకులు గుర్రం దానియేలు, పందీటి రజిని బాబు, పానుగంటి ఇజ్రాయేలు, కాపు నాయకులు బొజ్జా రంగనాథ్,ఉలాపు బాల చెన్నయ్య, మైనార్టీ నాయకులు షేక్ మదార్ వలి, షేక్ హనీఫ్, షేక్ అహ్మద్ బాషా,పట్టణ కౌన్సిలర్లు బిల్లా రమేష్ యాదవ్, పాలుగుళ్ళ చిన్న శ్రీనివాసరెడ్డి, బీసి నాయకులు వేములపాటి చంటి, జి.ఎమ్.వలి, పవన్, తదితరులు పాల్గొన్నారు.

9న 'క్విట్ కార్పొరేట్' జయప్రదం చేయండి

-సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు : కేంద్రం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 9న కలెక్టరేట్ వద్ద క్వింట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ కార్పోరేట్ పేరుతో నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. మాదాల నారాయణ స్వామి భవన్‌లో సంయక్త కిసాన్ మోర్చ జిల్లా సమావేశం శనివారం సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా కన్వినర్ చుండూరి రంగారావు అధ్యక్షతన నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ కార్మిక సంఘాలతో క్విట్ కార్పోరేట్ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వద్ద ఈనెల 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని రైతులు, కార్మికులు, ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్లకు దారా దత్తం చేయటాన్ని నిరసిస్తూ, కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, రైతులు పండించిన పంటకు స్వామినాధన్ సిఫార్సు మేరకు గిట్టుబాటు ధర కల్పించటంతో పాటుగా దానికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 15న ఒంగోలులో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభలో వివిధ కళా సంస్థలకు చెందిన రైతాంగ కళారూపాల ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ బహిరంగ సభకు కూడా ప్రజలు విరివిగా హాజరై జయప్రదం చేయాలని కోరారు. అలాగే మండల కేంద్రాలలోని రైతులు, కార్మికులు ఈ కార్యక్రమాలను ఈనెల 9 వ తేదీ నుండి 15 తేదీ లోపు జరపాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు,"రైతుకూలి సంఘం జిల్లా కార్యదర్శి లలిత కుమారి, ఆచార్య రంగా కిసాన్ సంస్థ అధ్యక్షులు చుంచు శేషయ్య పాల్గొన్నారు.